ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 4 మార్చి 2025

అభివృద్ధి, సంక్షేమానికే పెద్దపీట..!

- వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన బళ్లారి మేయర్ నందీష్
- గతేడాది మిగులు రూ.12.36 కోట్లు
- ఈసారి లోటు రూ.24.95 కోట్లు

—— వివరాలు.. 6లో..——


ప్రసంగిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్


జాతీయగీతం ఆలపిస్తున్న గవర్నర్, సభ్యులు

గ్యారెంటీలతో పెరిగిన ఆదాయం..!

- కర్ణాటక అభివృద్ధి విశ్వానికే మోడల్ • రాష్ట్రంలో శాంతిభద్రతలు భేష్ • ఉభయసభల్లో గవర్నర్ ప్రసంగం • అసత్యాలు పలికించారు.. : ప్రతిపక్ష నేతలు


వాకింగ్ స్టిక్‌తో వస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక అభివృద్ధి విశ్వానికే ఓ మోడల్‌లాంటిదని, రాష్ట్రంలో అమలవుతున్న గ్యారెంటీలతో ప్రభుత్వ ఆదాయం పెరిగిందని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పేర్కొన్నారు. సోమవారం శాసనసభ సమావేశాల తొలిరోజున ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. రాజ్‌భవన్ నుంచి వచ్చిన గవర్నర్‌ను విధాన సౌధ తూర్పుద్వారం వద్ద సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, స్పీకర్ యూటీ ఖాదర్, సభాపతి బసవరాజ హొరట్టిలు రెడ్‌కార్పెట్‌తో సాదరంగా స్వాగతించారు. శాసనసభలోని పోడియం వద్దకు గవర్నర్ చేరుకోగా ముఖ్యమంత్రి సభలో ప్రవేశించడానికి మూడు నిమిషాల పాటు జాప్యం జరిగింది. అంతవరకు వేచియున్న గవర్నర్ ఆ తర్వాత ముందుకు కదలి సీఎంతో కరచాలనం చేశారు. ఉభయసభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ కర్ణాటక మోడల్ అభివృద్ధి అంటే ప్రజా రంజకమని, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పాలనలు రూపొందించడం, గ్రీన్ ఎనర్జీ, మహిళా స్వావలంబన వంటివి అభివృద్ధికి నిదర్శనాలు అన్నారు. కర్ణాటక ప్రగతిపై ప్రపంచంలోని పలు ఆర్థికశాస్త్రవేత్తలు, విశ్వ విద్యాలయాలు అధ్యయనం చేస్తున్నాయన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ హ్యూమన్ రైట్స్ బ్లాగ్‌లో షైనింగ్ ఏ లైట్ ఇన్ ది డార్క్‌నెస్, ఏ బ్లూప్రింట్ ఫర్ ది వరల్డ్‌గా వ్యాఖ్యానించాయన్నారు.

నేరుగా ఖాతాల్లోకి..

గ్యారెంటీ పథకాలను గవర్నర్ ప్రస్తావిస్తూ ఏడాదికి 52 వేలకోట్ల రూపాయల గ్రాంట్లు కేటాయించగా రూ.70వేల కోట్ల దాకా ఐదు గ్యారెంటీల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు 90వేల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశామని, సామాజిక పింఛన్లు, రైతులకు పంప్‌సెట్‌లు, ఉచిత విద్యుత్, ఉద్యానవనరైతులకు ప్రోత్సాహకం, మత్స్య కార్మికులతోపాటు అన్ని రంగాల వారికి అభివృద్ధి సాధ్యం చేశామన్నారు.

అసత్యాలు : ప్రతిపక్ష నేతలు

గవర్నర్ చేత ప్రభుత్వం తప్పులు చెప్పిందని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని దారి తప్పించేలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, అయినా అభివృద్ధి పరుగులు అంటూ గవర్నర్‌చేత అబద్ధం చెప్పించారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతోపాటు జేడీఎస్ సభ్యులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


సీఎంను పరామర్శిస్తున్న గవర్నర్

గవర్నర్‌కు అవమానం అంటూ బీజేపీ నినాదాలు

ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్ కాసేపు ముఖ్యమంత్రి రాకకోసం వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో బీజేపీ సభ్యులు గవర్నర్‌కు అవమానం అంటూ నినాదాలు చేశారు. అంతలోనే కాంగ్రెస్ సభ్యులు ప్రతీదీ రాజకీయం సరికాదని అడ్డు తగిలారు. గవర్నర్ కంటే ముందుగా సీఎం సభకు రావాలని, గవర్నర్ వేచి ఉండడం సమంజసమా అన్నారు. అయితే కాంగ్రెస్ సభ్యులు గవర్నర్‌ను ఇప్పటికే విధానసౌధ ప్రాంగణంలో ముఖ్యమంత్రి ఆహ్వానించారని, వీల్‌చెయిర్‌లో సభకు వస్తున్నందున జాప్యం జరిగిందన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం..

గవర్నర్ తన ప్రసంగంలో రాష్ట్రంలో వివిధ రంగాల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. విద్యారంగానికి ప్రోత్సాహకం అందించాలని 13వేలకుపైగా ఉపాధ్యాయులను నియమించామని, ఉన్నత విద్యాశాఖకు అనుబంధంగా 1088 అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నియామకాలు జరిగాయన్నారు. 8,311 పాఠశాల గదులు నిర్మించామన్నారు. ప్రాంతీయ తారతమ్యం ఉండరాదనే వెనుకబడిన తాలూకాలకు 37,662 కోట్ల రూపాయలు విడుదల చేశామన్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో 10.72 లక్షలకోట్లు పెట్టుబడులు సాధ్యమయ్యాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో దేశంలోనే కర్ణాటక ముందంజలో ఉందని, అందుకే పారిశ్రామికవేత్తలు కర్ణాటకవైపు మొగ్గు చూపుతారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాలలో రెవెన్యూ పన్నులు 1,81,908 కోట్లకు చేరాయన్నారు. మైక్రో ఫైనాన్స్ వేధింపులనుంచి ఉపశమనానికి ప్రత్యేక చట్టం తీసుకొచ్చామన్నారు. పంట దిగుబడులకు వాతావరణం అనుకూలించకపోతే 194 హైటెక్ హార్వెస్ట్ హబ్‌లను తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో 27.41 లక్షల హెక్టార్లలో ఉద్యానవనపంటలతో దేశంలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా సముద్రపు అంబులెన్స్‌ను కొనుగోలు చేసేందుకు కసరత్తు సాగుతోందని తద్వారా చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులను ఆదుకునేందుకు వీలుంటుందన్నారు. పట్టు పరిశ్రమకు 60 కోట్ల రూపాయల సహాయధనం కేటాయించామని, 2025 జనవరి ఆఖరుకు 20.22 లక్షలమంది రైతులకు 16,942 కోట్ల రూపాయలు పంట రుణాలు, 46వేలమంది రైతులకు రూ.1442 కోట్లు దీర్ఘకాల రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ప్రోత్సాహకానికి ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. బెంగళూరు నగరంతో సంబంధం లేకుండా రాష్ట్రమంతటా పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు సాగుతోందన్నారు. కలబురగిలో వెయ్యి ఎకరాలతో జౌళిపార్క్‌కే కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. విజయపురలో విమానాశ్రయం కోసం 347 కోట్ల రూపాయలు, మైసూరులో రన్‌వే విస్తరణకు 319 కోట్లు, రాయచూరు ఎయిర్‌పోర్ట్‌కు రూ.219 కోట్లు విడుదల చేశామన్నారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ పరిధిలో సిగ్నేచర్ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంలో 9రైల్వేస్టేషన్ల అభివృద్ధికి 600 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. అన్నభాగ్య ద్వారా 4.48 కోట్లమందికి బియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. అటవీ ప్రాంతాన్ని 15వేల ఎకరాలలో పెంచదలిచామన్నారు. వన్యప్రాణుల నియంత్రణకు 78.9 కిలోమీటర్ల రైల్వే బ్యారికేడ్‌ను అటవీప్రాంతాల్లో అమర్చదలిచామన్నారు. వైద్య ఆరోగ్యరంగానికి ప్రాధాన్యత ఇచ్చామని, అనీమియా ముక్త కర్ణాటక కోసం విద్యార్థులకు పరీక్షలు జరిపించామన్నారు. ఆశాకిరణ ద్వారా కంటి పరీక్షలు చేశారన్నారు. రాష్ట్రంలో కిడ్నీ బాధితులకు 220 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రుల అభివృద్ధికి పలు ప్రత్యేక పథకాలు తీసుకొచ్చామన్నారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి ద్వారా గుల్బర్గాలో 371 పడకల జయదేవ హృద్రోగ ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. మైనారిటీ సంక్షేమశాఖ ద్వారా 25 మొరార్జీదేశాయ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, క్రిస్టియన్ సముదాయం కోసం 200 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గృహలక్ష్మి ద్వారా 1.26 కోట్లమంది మహిళలకు 36వేల కోట్ల రూపాయలు నేరుగా నగదు బదిలీ జరిగిందన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం...

గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన 344 హామీల్లో 331 హామీలకు ఆదేశాలు జారీ చేశారని ప్రశంసించారు. ఉత్తమమైన వర్షాలు కురవడంతో 149 లక్షల టన్నుల పంట దిగుబడులు సాధ్యం కానున్నాయని అంచనా వేశారన్నారు. అన్నదాత ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కంది, కొబ్బరిలకు ధర తగ్గినప్పుడు ప్రోత్సాహకధనం ఇచ్చారన్నారు. పాడి ఉత్పత్తిలో భాగంగా రోజుకు కోటి లీటర్ల పాలు సాధ్యం అవుతోందని, ఇప్పటివరకు పాడిరైతులకు రూ.1500 కోట్లు ప్రోత్సాహకం అందించామన్నారు. గొర్రెలు, మేకలు, పాడి పశువుల అకాల మరణానికి పరిహారం రూ.26.60 కోట్లు చెల్లించామన్నారు.

కాంగ్రెస్ లెజిస్లేచర్ సభ రద్దు

శాసనసభ సమావేశాల సందర్భంగా మంగళవారం నిర్వహించదలచిన కాంగ్రెస్ లెజిస్లేచర్ సభ రద్దు అయ్యింది. ఇదే విషయాన్ని కాంగ్రెస్ వర్గాలు ప్రకటించాయి. మూడు రోజుల కిందటే లెజిస్లేచర్ సభ జరిపే విషయమై శాసన సభ్యులు, పరిషత్ సభ్యులతో పాటు పార్టీ సీనియర్ నేతలకు సమాచారం ఇచ్చారు. అయితే సోమవారం శాసనసభ సమావేశాలు ప్రారంభమైన రోజునే లెజిస్లేచర్ సభను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 10న లెజిస్లేచర్ భేటీ నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. త్వరలోనే సమాచారం అందిస్తామని ప్రకటించారు.

విధానసౌధకు ప్రతిపక్ష ఎమ్మెల్యేల పాదయాత్ర

బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా గవర్నర్‌కు ఉండే అధికారాలకు భంగం కలిగంచేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రతిపక్ష పార్టీ బీజేపీ, జేడీఎస్ శాసనసభ్యులు నిరసనలో భాగంగా పాదయాత్ర చేశారు. శాసనసభ సమావేశాల్లో పాల్గొనేందుకు తొలిరోజున ఎమ్మెల్యేల క్వార్టర్స్ నుంచి విధానసౌధ వరకూ పాదయాత్రగా వచ్చారు. ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు నిరసనలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశ్వవిద్యాలయాలకు ఛాన్స్‌లర్‌గా గవర్నర్ కొనసాగే సంప్రదాయాన్ని తప్పించేందుకు ప్రభుత్వం కుట్రపన్నిందన్నారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా గవర్నర్‌కు ఉండే హక్కులను భంగం కలిగించాలను కోవడం ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలను కోవడమే అన్నారు. కాంగ్రెస్ చట్టాలను గరిష్టంగా సవరణలు చేయడం ద్వారా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించినట్లే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధన అంటే శాంతిభద్రతలను ఉల్లంఘించేలా చేయడమే అన్నారు. వారికి భవిష్యత్ ఆలోచనలు లేవని అందుకే సమాజంలో కొత్త అంశాలను తెరపైకి తెస్తున్నారన్నారు. గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్‌ను నియమించే ఆలోచన ద్వారా గవర్నర్ హక్కులకు భంగం కలిగినట్లే అన్నారు.


నినాదాలు చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

‘కంబళ’ ను ఆపే ప్రసక్తే లేదు..

- ‘పెటా’ వారు మా జోలికి రాకండి
- ముంబై, చెన్నైలోనే కాదు.. సాధ్యమైతే దుబాయ్ లోనూ నిర్వహిస్తాం: ఎమ్మెల్యే అశోక్‌కుమార్ రై


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌కుమార్ రై

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కంబళ క్రీడను అభిమానించేవారు ఎప్పటివరకు ఉంటారో... అప్పటిదాకా కొనసాగిస్తామని ప్రాణిదయాసంఘం (పెటా) తమ జోలికి రావద్దంటూ పుత్తూరు ఎమ్మెల్యే అశోక్‌కుమార్ రై తెలిపారు. ముంబై, చెన్నైలలోనే కాదని సాధ్యమైతే దుబాయ్‌లోనూ కంబళ పోటీలు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు మహాలింగేశ్వర ఆలయం దేవరమారు గద్దెలో కంబళపోటీలను ఉద్దేశించి ఆయన ఆదివారం మాట్లాడారు. ఏటా కంబళ క్రీడలను అభిమానించేవారు పెరుగుతున్నారన్నారు. కానీ పెటా సభ్యులు వ్యవస్థీకృతంగా న్యాయపోరాటం చేస్తున్నారన్నారు. కంబళను నిలిపివేసేందుకు వారి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారన్నారు. మాజీ మంత్రి వినయ్ కుమార్ సొరకె మాట్లాడుతూ జానపద వీరక్రీడగా కంబళకు పేరుందన్నారు. వ్యవసాయ పనులు తక్కువగా ఉండే సందర్భంలో రైతులు ఆత్మాభిమానంతో కంబళ క్రీడ పట్ల ఆసక్తి చూపుతారన్నారు. కంబళ కేవలం తీర ప్రాంత జిల్లాలకే పరిమితం కాలేదని బెంగళూరు నుంచి నటులతో పాటు ప్రముఖులు వస్తుంటారన్నారు. విదేశాలలో నివసించే తీరప్రాంత జిల్లాల వాసులు పోటీలు చూసేందుకు వస్తుంటారన్నారు. విధానపరిషత్ సభ్యుడు ఐవాన్ డిసౌజా, ముత్తప్పరై, దయానందరైకోర్మండ, ఎడపదవు స్వామి ప్రేమనాథశెట్టి, కంబళ సమితి అధ్యక్షులు చంద్రహాస్‌శెట్టి సహ పలువురు పాల్గొన్నారు.



మండిపోతాయ్ జాగ్రత్త..!

- ఉత్తర కన్నడ జిల్లాకు హై అలర్ట్
- మరో ఐదు రోజులు భారీ ఎండలు
- వాతావరణ పరిశోధనశాఖ హెచ్చరికలు



బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత జిల్లాల్లో మరో ఐదురోజులు వేడిగాలుల తోపాటు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని వాతావరణ పరిశోధన శాఖ హెచ్చరించింది. ప్రత్యేకించి ఉత్తర కన్నడ జిల్లాను ఎల్లో అలర్ట్‌గా ప్రకటించింది. రాష్ట్రమంతటా ఎండ వేడిమి పెరగనుందని సూచించింది. ప్రధానంగా తీరప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ జిల్లాల్లో ఐదు రోజులపాటు వేడిగాలులు వీస్తాయన్నారు. మూడు రోజులపాటు 30-40 కిలోమీటర్ల వేగంతో వేడిగాలులు ఉంటాయన్నారు. గరిష్టంగా తీరప్రాంత జిల్లాల్లో 35-38 డిగ్రీల సెల్సియస్ నమోదు కానుందని, ఉత్తర కర్ణాటక ప్రాంతం బెళగావి, బీదర్, ధారవాడ, రాయచూరు, హావేరి జిల్లాల్లో 34-35 డిగ్రీలు, విజయపుర, గదగ్ కలబురగి, కొప్పళ, బాగల్కోటెలో 36-38 డిగ్రీలు, దక్షిణ ప్రాంతాలైన బెంగళూరు, చామరాజనగర, మడికేరి, మైసూరులలో 32-34 డిగ్రీలు, చిత్రదుర్గ, దావణగెరె, మండ్య, శివమొగ్గలలో 35-36 డిగ్రీలు నమోదు కానుందని ప్రకటించారు. గడిచిన 24 గంటలలో సాధారణంగా 2.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగినట్టు వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో సాధారణం కంటే ఒకటిరెండు డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం వేళ ఎండలో తిరగకుండా ముందస్తు చర్యలు ప్రజలు పాటించాలని సూచించారు. అవసరం అయితే బయట తిరగరాదని, వృద్ధులు, పిల్లలు జాగ్రత్త వహించాలని సూచించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.30	5.17
మంగళవారం సాయంత్రం	బుధవారం ఉదయం

ఆస్పత్రికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు..!

- కేజీఎఫ్-మాలూరు మధ్య ఎక్స్‌ప్రెస్ వేలో ఘోర రోడ్డు ప్రమాదం • బైక్‌ను ఢీకొన్న ఇన్నోవా వాహనం
- నలుగురి దుర్మరణం • మరో నలుగురికి తీవ్రగాయాలు

బెంగళూరు/వి.కోట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తండ్రి ఆస్పత్రిలో ఉన్నారని పరామర్శకు వెళ్లి వస్తున్న కుటుంబ సభ్యులు మృత్యువాత పడ్డారు. బెంగళూరు-వి.కోట మధ్య ఇటీవల మొదలైన ఎక్స్‌ప్రెస్ వేలో కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తాలూకా కుప్పనల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్నాటక రాష్ట్రం కదిరిగానికుప్పంకు చెందిన శీనప్ప బెంగళూరు ఆసుపత్రిలో ఉండగా ఆయన కుమారుడు మహేష్‌కుమార్ వారి కుటుంబ సభ్యులతో కలసి ఆసుపత్రికి వెళ్ళి తిరిగి వస్తుండగా ఆదివారం అర్ధరాత్రి వారు ప్రయాణిస్తున్న ఇనోవా కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. మాలూరు-కేజీఎఫ్ మధ్యన ఎక్స్‌ప్రెస్ వేలో కుప్పనల్లి సమీపంలో కారుకు ఎదురుగా ద్విచక్ర వాహనం లైటులేకుండా అడ్డురావడంతో ప్రమాదవశాత్తు కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహన దారుడితో పాటు, కారులో ప్రయాణిస్తున్న కమ్మసంద్ర గ్రామానికి చెందిన మహేశ్ (45), రత్నమ్మ (60), ఉద్విత (2)తోపాటు ద్విచక్రవాహనం నడుపుతున్న శ్రీనాథ్ (30) అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న పూగానిపల్లెకు చెందిన చంద్రప్ప భార్య సుజాత(48), ఆమె కుమార్తె సుష్మిత(30), ఆమె కుమారుడు విరాట్ (4), కారు డ్రైవర్ సునిల్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కోలారు మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 8 నెలల గర్భిణి అయిన సుష్మిత కడుపులోని పాపను కాపాడేందుకు వైద్యులు శస్త్ర చికిత్స చేసినా పాపను కాపాడలేక పోయినట్లు బంధువులుతెలిపారు. సుష్మిత పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను బెంగళూరుకు తరలించి అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతోంది. సుజాత, విరాట్, సునిల్‌ల పరిస్థితి అదుపులోనే ఉందని ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం. ఈ ఘటనలో ఇనోవా కారు పూర్తిగా ధ్వంసంకాగా, కారు ఢీకొన్న తీవ్రతకు ద్విచక్ర వాహనం ముక్కలు ముక్కలైంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బంధువులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో తీరని విషాదం అలముకుంది. ఇటీవల ట్రయల్ రన్ కోసం వాహనాలను అనుమతించిన ఎక్స్‌ప్రెస్ వేలో బంగారుపేట- కేజీఎఫ్ మధ్యన వాహనాలు అతివేగంగా ఒకే వైపు వస్తుండటం వల్లే తరచు ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. బంగారుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగారుపేట ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువుల ఆర్తనాదాల మధ్య మృతదేహాలను వారి స్వగ్రామాలకు అంత్యక్రియలు పూర్తి చేశారు.



ప్రమాదంలో నుజ్జయిన ఇన్నోవా వాహనం


మహేష్‌కుమార్ (ఫైల్)


రత్నమ్మ(ఫైల్)


ఉద్విత (ఫైల్)


గాయాలతో సుష్మిత



తుంగభద్ర నీటి మట్టం
:1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1606.52	1,586.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,178	885
నీటి నిల్వ (టీఎంసీలు)	31.22	8.29



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు: కలెక్టర్

బళ్లారి సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఏవియస్ ఇన్‌ఫ్లూఎంజా (బర్డ్‌ఫ్లూ) అనేది పక్షుల్లో వైరస్ వల్లకలిగే వ్యాధి అని, ఇది అంటు వ్యాధి కాదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా చల్లని ప్రాంతాల నుంచి వలస పక్షులు సంతానోత్పత్తికి వచ్చినప్పుడు వాటి రెట్టలు, ఈకలు, నోరు, కళ్ల నుంచి వచ్చే స్రావాల ద్వారా వ్యాప్తి చెందే అవకాశంఉందని ఈ వ్యాధి పక్షులకు వ్యాపిస్తుందన్నారు. ప్రజలు మాంసం, గుడ్లను 70డిగ్రీల వద్ద కనీసం 30నిమిషాలు ఉడికించినప్పుడు వైరస్ నాశనం అవుతుందన్నారు. మాంసం, గుడ్లను బాగా ఉడికించి తినాలన్నారు. జిల్లాలో తొలిసారిగా ఫిబ్రవరి23న కురేకుప్ప పౌల్ట్రీ బ్రీడింగ్‌లో పెంచిన ఆసిల్, కావేరి జాతుల కోళ్లలో చికెన్ ఫ్లూ లక్షణాలు కనిపించాయి. కొన్ని చోట్ల చనిపోయాయి. చనిపోయిన కోళ్ల నమూలాలను తదుపరి పరీక్షల కోసం బెంగళూరులోని ఐఏహెచ్ , వైబీహెచ్‌కి పంపారు. భోపాల్‌లోని ఐసీఏఆర్ నేషనల్ హై సెక్యూరిటీ యూనియన్ డీసీజ్ లాబోరేటరి నుంచి ధ్రువీకరించిన కేసు నివేదించబడిన తర్వాత బర్డ్‌ఫ్లూగా ప్రకటించారు. మార్గదర్శకాల ప్రకారం 2400 కోళ్లను శాస్త్రీయంగా పారేసినట్లు తెలిపారు. జిల్లాలోని కోళ్లు, బాతులు వలస పక్షులు అసాధారణంగా చనిపోతే వెంటనే సమీపంలోని పశువైద్య విభాగానికి సమాచారం ఇవ్వాలని జిల్లాపంచాయితీ ముఖ్యకార్యనిర్వహణాధికారి మహ్మద్ హరిస్ సుమేర్ అన్నారు. దరోజీ సరస్సు ప్రాంతానికి వివిధ రకాల పక్షులు వలస వస్తాయి. ఈ విషయాన్ని పర్యవేక్షిస్తున్నామని ఆయన అన్నారు

అధికారుల సూచనలు

జిల్లాలో ఏవియస్ ఇన్‌ఫ్లూఎంజా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులను ఇప్పటికే ఆదేశించారు. కోళ్లలో ఏవైనా అసాధారణ మరణాలు కనిపిస్తే వెంటనే పశు సంవర్ధక శాఖకు తెలియజేయాలని గ్రామపంచాయితీ పరిధిలోని కోడి మాంసం గుడ్లు అమ్మకాల దుకాణాల్లో ఉత్పన్నమయ్యే వ్యర్థాలను సక్రమంగా పారవేసేందుకు చర్యలు తీసుకోవాలని కోళ్లఫాంల యజమానులను ఆదేశించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పశుసంవర్ధక, పశువైద్య సేవల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హనుమంత నాయక్ కరబారి, అసిస్టెంట్ డైరెక్టర్ డా.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు స్వాధీనం

రాయచూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రాగిమానగడ్డ వీధిలో కల్తీ కల్లు విక్రయం అడ్డా పై సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడిలో 60 లీటర్‌ల కల్తీకల్లు పట్టుపడగా నిందితులైన ఇద్దరిలో భార్య రామలమ్మను అదుపులోకి తీసుకున్న పోలీసులు మారెప్ప కోసం గాలింపు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఇంటి యజమానుల పైనా కేసు నమోదు చేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులుతెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికే పెద్దపీట..!

● వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మేయర్ ● మిగులు రూ.12.36 కోట్లు.. ఈసారి లోటు రూ.24.95 కోట్లు



నగర పాలికె వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న మేయర్ ముల్లంగి నందీష్ బాబు

బళ్లారి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర పాలికె బడ్జెట్‌ను మేయర్ నందీష్ కుమార్ సోమవారం ప్రవేశపెట్టారు. ఈ సారి బడ్జెట్‌లో ప్రజల సౌకర్యాలకు పెద్దపీట వేశారు. అలాగే నగరంలో ఆదాయం వనరులు సమకూర్చకోవడంతోపాటు వివిధ వర్గాలకు కల్పించాల్సిన సౌకర్యాలు స్థూలంగా వివరించారు. 2025-26 నగర పాలికె వార్షిక బడ్జెట్ సమావేశం జడ్పీ సమావేశ భవనంలో నిర్వహించారు. మేయర్ నందీష్ బాబు నగర పాలికె వార్షిక బడ్జెట్‌ను సభ్యులకు చదివి వినిపించారు. 2024-25 ఏట ప్రారంభ నిల్వ రూ. 12కోట్ల 362 లక్షలు అని, 2024-25 ఏడాది ఆదాయం రూ. 24కోట్ల 899 లక్షలు అని తెలిపారు. ప్రారంభ నిల్వ వచ్చిన ఆదాయం మొత్తం రూ. 37కోట్ల 261 లక్షలు అని వివరించారు. 2025-26 లోటు బడ్జెట్ రూ. 24.944 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. నగరంలో తాగునీటి ట్యాంక్ పెంచనున్నామని తెలిపారు. హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, ఫంక్షన్ హాల్స్ ఇతర వాణిజ్య సముదాయం వాడే నీటికి అధిక పన్ను విధిస్తామన్నారు. ఇంట్లో వాడే నీటికి ఎటువంటి పన్ను పెంచలేదన్నారు. నగరంలో ఉన్న వివిద ఆస్తుల విలువలు గుర్తించేందుకు జియోట్యాక్ విషన్ ద్వారా ఆస్తుల విలువలు గుర్తించి ట్యాక్సు వేస్తున్నట్లు తెలిపారు. అలాగే వీధికుక్కలు పట్టించేందుకు వాటి సంతానోత్పత్తి నివారణకు ప్రత్యేకకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. మృతదేహాలను స్మశానం వరకూ ఉచితంగా తరలించేందుకు కార్పొరేషన్ తరుపున రెండు అబులెన్స్‌లను కొనుగోలు చేయనున్నారు. నగరంలో ఉద్యానవనాల పెంపు, చిన్న మార్కెట్‌లో నూతనంగా వాణిజ్య సముదాయ భవనాలు నిర్మాణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. రహదారులు, ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రొత్సాహానికి నిధులు కేటాయించారు. పరిశిష్ట జాతి, పరిశిష్ట పంగడ, బీసీ, మైనార్టీ ఇతర వర్గాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, అలాగే ల్యాబ్ ట్యాబ్‌ల కొనుగోళ్లు, ఇతర సౌకర్యాలకు నిదులు కేటాయించారు. చెట్టు పెంపకం, అలాగే స్మశానాల్లో అభివృద్ధి. నీటి సౌకర్యాలకు నిధులు కేటాయించారు. మొత్తం 20 అంశాలతో బడ్జెట్‌ను మేయర్ నందీష్‌బాబు ప్రవేశపెట్టారు. దీనికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది, ఈ బడ్జెట్ సమావేశంలో బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కమిషన్ ఖలీల్, డిప్యూటీ మేయర్ సుఖుమ్, కార్పొరేటర్లు గోవిందరాజులు, విక్కీ, ప్రభంజన్, ఇబ్రహీం బాబు, గాదెప్ప, మించు శ్రీనివాసులు, మించు కుబేరా, రామాంజనేయులు, వివిద వార్డుల కౌన్సిలర్లు, అధికారులు హజరయ్యారు.

రూ.1200 కోట్లతో బళ్లారికి తాగునీరు

● తుంగభద్ర జలాశయం నుంచి తరలింపు
● 6న రూ.265 కోట్ల పనులకు ఈ-టెండర్
● కేఎంఈఆర్‌సీ నిధులతో పనులు: ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బళ్లారి ప్రజలకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి శుభవార్త అందించారు. నగరానికి నిత్యం తాగునీరు అందించేందుకు రూ. 1200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ప్రాజెక్టుకు ఈ నెల 6 న టెండర్ పిలవనున్నట్లు ఎమ్మెల్యే భరత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం బళ్లారి జడ్పీ అవరణంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తొలివిడత కింద రూ. 265 కోట్లతో ఓఆర్ఎస్ ట్యాంకులు నిర్మాణంకు టెండర్ పిలవనున్నారు. తరువాత విడతల వారీగా ఈ పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం రూ.1200 కోట్ల అంచనాతో కేఎంఈఆర్‌సీ నిధుల నుంచి పనులు చేపడ్తామన్నారు. ఈపనులు వేగవంతంగా చేసి ప్రజలకు తాగునీరు ఇబ్బందులు తీరుస్తామన్నారు. బళ్లారిలో ఎల్‌ఎంఎం కళాశాల ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అలాగే కంప్లి-బళ్లారి మధ్యలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని ప్రధాన రోడ్లుతో పాటు నగరంలో ఉన్న అన్ని రహదారులు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 20 వరకు సాగునీరు విడుదల చేయాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివపుత్ర గౌడ నందిహాళ్

రాయచూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు పరిధిలో నారాయణపూర్ కుడికాలువ, రాంపూర్ ఎత్తిపోతల పథకం పరిధిలోని రెండు కాలువలకు ఏప్రిల్ 20 వరకు సాగు నీరు విడుదల చేయాలని కర్ణాటక రైతు సంఘం, హసిరుసేనల జిల్లాధ్యక్షుడు శివపుత్ర గౌడ నందిహాళ్ కోరారు. సోమవారం లింగసుగూరు సహాయ కమిషనర్‌ను కలిసి యూనియన్ తరఫున వినతి పత్రం ఇచ్చారు. ఈ రెండు కాలువల పరిధిలో ఇప్పటికే రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు వారాబంది లెక్కన నీటిని విడుదల చేయడం వల్ల ఎటాంటి పంట నష్టం లేకుండా రైతులు గట్టేక్కే అవకాశం ఉందన్నారు. నీటిని నిలిపివేయడంతో లక్ష్యల్లో వెచ్చించి పంటలు సాగు చేసిన రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురైయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా రెండు కాలువల్లో నీటిని నిలుపుదల చేసిన అధికారులు, దేవున ఉన్న తెలంగాణ రాష్ట్రానికి 1.27 టీఎంసీల నీటిని విడులద చేయడం ద్వారా రైతుల నోట్లను దుమ్ముకొట్టారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశం లేకుండా రాత్రికి రాత్రే 1.27 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసిన విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా రెండు కాలువలకు ఏప్రిల్ 20 వరకు నీటి విడుదల జరగక పోతే రైతు సంఘం ఆధ్వర్యంలో దశల వారిగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నేడు జోడు రథోత్సవాలు



సిద్దేశ్వర మహాస్వామి, గాదిలింగప్ప తాత

కంప్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు గూళ్యం గ్రామం వద్ద వేదవతి నది ఒడ్డున వుండే గురుశిష్యులు సిద్దేశ్వరస్వాములు, గాదిలింగప్ప తాత జోడు రథోత్సవాలు మంగళవారం అంగ రంగ వైభవంగా జరగనున్నాయి. ఇటు కర్ణాటక, ఆంధ్ర ఎక్కువగా భక్తాదులు రథోత్సవానికి పోటెత్తి స్వామివారికి మొక్కులు కూడా సమర్పించుకుంటారు. రెండు రాష్ట్రాలకు సరిహద్దున వుండటంతో బళ్లారి, కర్నూలు జిల్లాల భక్తులు లక్షలాది సంఖ్యలో హాజరవుతారు. ఇప్పటికే బసరకోడు గ్రామ పంచాయతీ పరిధిలో కాలినడకన వచ్చే భక్తాదులకు ప్రజాప్రతినిధులు అన్న ప్రసాదాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

జీవనశైలిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

సిరుగుప్ప, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి ఉత్తమ జీవితాన్ని గడపాలంటే పరిశ్రమలపై అవగాహన అత్యవసరమని ఎన్ఎస్ఎస్ అధికారి కుబేర పేర్కొన్నారు. తాలుకాలోని హాళేకోట గ్రామంలో ప్రభుత్వ హైస్కూలులో విద్యార్థులకు యువ స్పందన ఆధ్వర్యంలో జీవనశైలికార్యక్రమం ఉత్తమ జీవిత మార్గం విధానాన్ని పెంపొందించడం కోసం గ్రామ పంచాయతీ, విద్యాశాఖ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జీవన శైలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి కుబేర మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులు వ్యక్తిత్వం, ఎదుగుదల, ఉత్తమ విద్యాభ్యాసం దక్కించు కోవాలంటే మొట్టమొదట ఉత్తమ జీవన విధానాన్ని అనుసరించాలని ఆయన చెప్పారు. విద్యార్థులు, వివిధ సంఘాలలో ముందుకు వెళ్లే విధానాలను అధికారులు విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూలు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునిలు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసనలో నీటి సరఫరా ఉద్యోగులు

నీటి సరఫరా ఉద్యోగుల నిరసన

బళ్లారి సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నీటి సరఫరా ఉద్యోగులు సోమవారం జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు సత్యబాబు మాట్లాడుతూ 'డీ' కేడర్ నీటి సరఫరా ఉద్యోగులకు అనేక సంవత్సరాలుగా అన్యాయం జరుగుతోందన్నారు. ఖాళీగా ఉన్నపోస్టులకు నియమకాలు లేదా నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. నీటి సరఫరా, మరమ్మతుదారుల సంఘం ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తోందన్నారు. 10 సంవత్సరాలుగా బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్‌లో వాల్‌మ్యాన్, లీకేజీ, తోటమాలి, బోర్‌వెల్ ఉద్యోగులుగా 131 మంది పని నిర్వహిస్తున్నామని, గతంలో సమ్మెచేసినప్పుడు ఎమ్మెల్యేలు, కమిషనర్లు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం, ప్రత్యక్ష నియామకం ప్రత్యక్ష చెల్లింపులు చేస్తామని హామి మేయర్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు హామీఇవ్వడంతో సమ్మెను విరమించుకున్నామన్నారు. అందుకోసం 2025-26 బడ్జెట్ ప్రజెంటేషన్‌లో మన ప్రత్యక్ష నియామక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి, ప్రత్యక్ష నియమకాలు, ప్రత్యక్ష చెల్లింపులుచేయాలన్నారు. సివిల్ సర్వెంట్ల నమూనాలో ప్రత్యేక ప్రత్యక్ష నియామకాలను భర్తీ చేయడం, ఖాళీగా ఉన్న 131 పోస్టులను ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతో భర్తీ చేయాలని కోరారు.

ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి

కంప్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణ పంచాయతీ ఆధ్వర్యంలో కుడితినిలో ప్రభుత్వం నూతనంగా అమలుపరచిన ఈ ఖాతా, బీ ఖాతా సదుపాయాలను సద్వినియోగ పరచుకోవాలని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ తెలిపారు. జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో ఈ ఖాతా అభియాన కార్యక్రమాన్ని ఆమె మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ పరిధిలో వుండే ప్రభుత్వ భూములు, సొంత భూములు ఈ ఖాతా, బీ ఖాతాలో చేర్చి డిజిటల్ పద్దతిని అమలు చేసిందని, ప్రతి ఒక్కరు వారి భూములు, వారి స్థలాలను వారి పేరిట చేయించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ పంచాయతీకు వెయ్యి ఇళ్లు మంజూరయ్యాయి. పేద కుటుంబాలను గుర్తించి వారికి ఇళ్ల సదుపాయం కల్పిస్తామన్నారు. పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా బోర్లను మరమ్మత్తులు చేయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థాయి సమితి అధ్యక్షులు వి రాజశేఖర్, కౌన్సిలర్లు శంకరమ్మ, వెంకటరమణబాబు, ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్, వీకేసీ చంద్రప్ప పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ అధికారి శివబసవరాజు

కంప్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో జొన్నలు కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు జిల్లా అధికారి శివ బసవరాజు తెలిపారు. జిల్లాలో ఎమ్మిగనూరుతో పాటు సిరుగుప్ప, అచ్చొళ్లి, కరూరు, బళ్లారి ఈ ఐదు భాగాల్లో ఒకే రోజు జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన ఎఫ్ ఏక్యూ జొన్నలకు క్వింటాల్‌కు రూ. 3371 ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరులో 1235 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కంప్లి తాలుకాలో 45 మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శారదమ్మ, ఉపాధ్యక్షురాలు గాదిలింగప్ప, సొసైటీ అధ్యక్షులు ఖాసీమ్ సాబ్, ఉపాధ్యక్షులు అల్లాసాబ్, పౌర ఆహార శాఖ అధికారి విరుపాక్షి గౌడ, కార్యదర్శి జడేష్, మురుగేష్, మహేష్ గౌడ, సదాశివప్ప, శరణుగౌడ, ఖాసీమ్ సాబ్, సూగప్ప, రామకృష్ణ రైతు సంఘం అధ్యక్షులు వడ్డు వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అబ్దుల్లాకు వైద్యశ్రీ అవార్డు



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న మంత్రులు

బళ్లారి సిటీ,మార్చి 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం వైద్యుల సేవను గుర్తించి సమాజంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మద్దతుగా బీజాపూర్‌లో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ వైద్య అధికారుల 31వ రాష్ట్ర సమావేశంలో బళ్లారి జిల్లా అంటు వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లాను వైద్యశ్రీ అవార్డుతో సత్కరించింది. ఆయన 25సంవత్సరాలుగా బళ్లారి జిల్లాలోని వివిధ ఆరోగ్య కేంద్రాలలో మెడికల్ ఆఫీసర్,డిస్ట్రిక్ ఆర్‌సీహెచ్ ఆఫీసర్‌గా సేవలందించారు, ప్రస్తుతం డిస్ట్రిక్ వెక్టర్ బెస్ట్ డీసీజ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన చేసిన ప్రశంసనీయ సేవకు గుర్తింపుగా వైద్యశ్రీ అవార్డును అందుకున్నారు.ముఖ్యమంత్రి సిద్దరామయ్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ఈరోజుల్లో ఆరోగ్య సేవలు ఆకాశాన్ని అంటుతున్నప్పుడు పేదలు ప్రభుత్వ ఆసుత్రులపై నమ్మకం ఉంచుతారు వైద్య అధికారులు ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలి. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన సదేశం ఇచ్చారు. ఈసందర్భంగా భారీ మధ్యతరహా పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మంత్రి ఎంబీ పాటిల్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేష్ గుండురావ్, జౌళి చెరకు అభివృద్ధి చక్కెర వ్యవసాయ మార్కెటింగ్ మంత్రి శివానంద్,ఎస్.పాటిల్ సహా ఆ శాఖ సీనియర్ అధికారుల సమక్షంలో అవార్డులను ప్రధానం చేసి సత్కరించారు.

జడేష్ బృందానికి ప్రశంసలు

బళ్లారి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హంపిలో ఉత్సవాల్లో చివరి రోజు ఆదివారం రాత్రి జడేష్ ఎమ్మిగనూరు కళాబృందం ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. పుట్టరాజ గవాయి పాటతో ప్రారంభించి అనేక జానపద గానాలు, కళా నృత్యాలు, చేసి ఆకట్టకుంది. విజేతలకు హంపీ ఉత్సవ కమిటీ బహుమతులు అందించారు. రమణప్ప, డీ.జీ తిరుపమల, భజంత్రీ శ్రీధర్, సుమిత్ర, జేఎస్ అభినందన్. జేఎస్ అశ్వత్, పరతీక్ష. జాహ్నవి పాల్గొన్నారు.



జడేష్ కళాబృందాన్ని సత్కరిస్తున్న హంపి ఉత్సవ కమిటీ సభ్యులు

హోసూరు జోన్



సహాయక చర్యల్లో స్థానికులు

ఆగి ఉన్న కారును ఢీకొన్న బస్సు

● క్షేమంగా బయటపడిన కారు డ్రైవర్

హోసూరు (క్రైం)మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలో ఆగివున్న కారును బస్సు ఢీ కొట్టడంతో కారు నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తు కారు డ్రైవరు ప్రాణాలతో బయటపడ్డాడు. రాష్ట్ర సరిహద్దు జూజూవాడి రవాణాశాఖ కార్యాలయం చెక్‌పోస్టు సమీపంలో ట్రాఫిక్ జామ్‌తో ఆగియున్న కారును ప్రైవేట్ లగ్జరీ బస్సు ఢీ కొనగా ఆ కారు ముందున్న లారీ క్రింద పడింది. బెంగళూరుకు చెందిన థానదమర్(40) పని నిమిత్తం సోమవారం ఉదయం తన కారులో సేలంకు బయల్దేరాడు. ట్రాఫిక్‌జామ్ కారణంగా ఆయన కారును రోడ్డు పక్కన పార్కు చేసి కొంత దూరం నిలబడి ఉన్నాడు. బెంగళూరు నుంచి హోసూరు వైపు వస్తున్న తమిళనాడు రిజిస్ట్రేషన్ ఓమ్ని బస్సు అనూహ్యంగా ఆగివున్న కారును వెనుక నుంచి ఢీకొంది. ఆ వేగానికి కారు నుజ్జునుజ్జయింది. ఘటనపై సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

పాఠశాలలో మిఠాయిల పంపిణీ

హోసూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని హోసూరు కార్పొరేషన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. హోసూరు వెస్ట్ రీజియన్ ఐదో వార్డులో ముఖ్యమంత్రి ఎం.కే.స్టాలిన్ పుట్టినరోజు నేపథ్యంలో హోసూరు కార్పొరేషన్ చిన్న ఎలసగిరి బాలాజీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంల్లో ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు రవి కేక్ కట్ చేశారు. వార్డు కార్యదర్శి రఘు ఏర్పాట్లు చేయగా కార్యక్రమంలో శేఖర్, రఘు, భాస్కర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రి అల్పాహార' ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్

హోసూరు(కృష్ణగిరి), మార్చి 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అల్పాహార కార్యక్రమం అమలుకు సంబంధించి కృష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్... అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామీణ జీవనోపాధి అభివృద్ధి కార్యక్రమ డైరెక్టర్ పెరియస్వామి, కలెక్టర్ ఇంటర్వ్యూఅసిస్టెంట్ హరిహరన్, జిల్లా ప్రాథమిక విద్యాధికారి మునిరాజు, ఐసీడీఎస్ అధికారి జయంతి పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం జయలలిత జయంతి

హోసూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, అన్నా డీఎంకే నేత జయలలిత 77వ జయంతిని పురస్కరించుకుని కృష్ణగిరి పశ్చిమ జిల్లా శూలగిరి ప్రాంతంలో బహిరంగ సభ, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ జిల్లా కోశాధికారి మల్లయ్య అధ్యక్షత వహించారు. శూలగిరి తూర్పు యూనియన్ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా నెత్తియడినాగయ్య, వాలజా కృష్ణన్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, మాజీ మంత్రి కేపీ మునిస్వామి మాట్లాడుతూ అన్నాడీఎంకే హయాంలో ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాము కేంద్ర ప్రభుత్వానికి బానిసలుగా ఉండేవారమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సామరస్యంగా ఉంటేనే రాష్ట్రానికి పథకాలు సజావుగా ప్రవేశపెట్టగలమన్నారు. చివరకు పన్నుల వాటాను అడిగి తెచ్చుకున్నామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కళాసెల్వి, రామన్, సెల్వం, బాబు వెంకటచలం, మాదేశ్, మురుగన్, సిలాస్ కృష్ణన్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మాజీ మంత్రి కేపీ మునుస్వామి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంత్...

వివాల్డి (జయంతి)



ఆంటోనియో లూసియో వివాల్డి 1678 మార్చి 4న ఇటలీ దేశం వెనిస్‌లో జన్మించారు. రోమన్ కేథలిక్ క్రైస్తవ ధర్మగురువు. పాశ్చాత్య శాస్త్రీయసంగీతమైన బారూఖ్ శైలి ప్రసిద్ధ వాగ్గేయ కారుడు. పియానో, చేంబర్, సింఫోని సంగీత వాద్యాలలో నిష్ణాతులు. ఫోర్ సీజన్స్ పేరిట వెలువడిన వయోలిన్ కృతులు ఎంతో పేరొందాయి. రెండు శతాబ్ధాల అనంతరం ఆయన సంగీతకృతులు వెలుగులోకి వచ్చి ప్రాచుర్యం పొంది నేటికీ వినిపిస్తున్నాయి. 1741 జూలై 28న కన్నుమూశారు.

బులుసు సాంబమూర్తి (జయంతి)



బులుసు సాంబమూర్తి 1886 మార్చి 4న తూర్పుగోదావరి జిల్లా దుళ్ళ గ్రామంలో జన్మించారు. దేశభక్తుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర, విశాలాంధ్ర అనే పరమలక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేసిన కార్యశూరుడు. మద్రాసు శాసనసభకు 1937 నుంచి 1942వరకు స్పీకర్‌గా గౌరవ ప్రతిష్ఠలను సమకూర్చారు. 'దాస్యం కంటే దారిద్ర్యం మేలు' అనే నినాదంతో తన సర్వస్వాన్ని దేశోద్ధరణకు సమర్పించిన ఈయన చివరి రోజుల్లో పేదరికం, అనారోగ్యంతో గడిపి 1958 ఫిబ్రవరి 2న పరమపదించారు. ఆయన గౌరవార్థం 2008లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోస్టల్‌స్టాంపు విడుదల చేసింది.

రోహన్ బోపణ్ణ (పుట్టినరోజు)



ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు రోహన్ బోపణ్ణ 1980 మార్చి 4న బెంగళూరులో జన్మించారు. 2002 నుంచి ఇండియన్ డేవిస్‌కప్ జట్టు సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2013 లో డబుల్స్‌లో వరల్డ్ నెంబరు 3గా నిలిచారు. అసియమ్-ఉల్-హక్ ఖురేషితో కలసి పలు పోటీల్లో పాల్గొన్నారు. వీరి ద్వయం ఇండో-పాక్ ఎక్స్‌ప్రెస్‌గా పిలవబడింది. యూఎస్ ఓపెన్ వింబుల్డన్‌లో రన్నరప్‌గా నిలిచారు. 2012, 2016లలో ఒలింపిక్ గేమ్స్‌లో ఆడారు. 2017 ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విజేత. కర్ణాటక ప్రభుత్వంచే ఏకలవ్య పురస్కారం, ఇతర అవార్డులు పొందారు. 2023 ఖత్తర్ ఓపెన్‌లో మాథ్యూ ఎబ్డెన్‌తో కలసి టైటిల్ సాధించారు.

ఏడుగురి ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో.. వేర్వేరు కారణాలతో.. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో వివిధ కారణాలతో ఏడుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఓ వృద్ధురాలు, ఓ యువతి, నలుగురు మహిళలు, ఓ యువకుడు ఉన్నారు. ముగ్గురు అనారోగ్య కారణాలతో, ఓ మహిళ మానసిక అనారోగ్యంతో బలవన్మరణానికి పాల్పడ్డారు. భర్త మరణాన్ని జీర్ణించుకోలేక ఇంకొకరు ఉరి వేసుకున్నారు. కారణాలు తెలియాల్సి ఉంది.

● 'ఆయన ఉన్నంతవరకే నేను..! ఆయన చనిపోతే.. గంటలోగా నేనూ చనిపోతా..' అని తరచూ బంధుమిత్రులతో చెప్పుకునే భాగ్యమ్మ(54).. అన్నంతపనీ చేశారు. భర్త తిమ్మారెడ్డి(62) గుండెపోటుతో మృతిచెందడంతో.. బాధ భరించలేక ఆమె ఇంటి వెనుక ఉన్న చింతచెట్టుకు ఉరి వేసుకున్నారు. తిమ్మారెడ్డికి గుండె సంబంధిత వ్యాధి ఉన్నింది. బెంగళూరులో చికిత్స చేయించుకుని తిరిగి వచ్చిన ఆయన.. ఎప్పటిలాగే పొలానికి వెళ్లి తిరిగొచ్చారు. కాళ్లూ చేతులు కడుక్కుంటూ కుప్పకూలిపోయారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేని భాగ్యమ్మ.. ఇంటి వెనకాల చింతచెట్టుకు ఉరి వేసుకున్నారు.

● రాయదుర్గం శాంతినగర్‌కు చెందిన నాగళ్లి శివమ్మ(70) అనారోగ్యంతో బాధపడుతుండేవారు. వ్యాధి నయం కాకపోవడంతో సోమవారం తెల్లవారుజామున ఒంటిపై రసాయనం పోసుకుని నిప్పంటించుకున్నారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ జయనాయక్ వెళ్లి పరిశీలించారు. శివమ్మకు నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భర్త ఇదివరకే మృతి చెందాడు. చిన్న కుమారుడు ఉమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన శ్రీనివాసులు(30) ఉరి వేసుకున్నాడు. శ్రీనివాసులు బళ్లారిలోని మోకా వద్ద, కలకుట్టనల్లి వద్ద భార్య కవితతో కలిసి బేల్దారీ పని చేస్తూ జీవనాన్ని సాగించేవాడు. పదిరోజుల కిందట రాయదుర్గానికి వచ్చాడు. ఇంట్లో దుర్వాసన వస్తుండటాన్ని సోమవారం సాయంత్రం గమనించిన స్థానికులు, లోపలికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతున్న మృతదేహం కనిపించింది. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

● గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన త్రివేణి(17) కడుపునొప్పి తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు తల్లిదండ్రులు వడ్డే శివమ్మ, ఈరన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● కుందుర్పికి చెందిన అంకిత(26) ఉరివేసుకున్నారు. ఆమె కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. భర్త నాగరాజు, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగానే ఇంట్లోనే పైకప్పునకు చీరతో ఉరి వేసుకున్నారు. వారు తిరిగొచ్చేలోగా ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● తనకల్లు మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన శాంతమ్మ(30) ఉరి వేసుకున్నారు. కర్ణాటకలోని రామ్‌పురానికి చెందిన శాంతమ్మకు 15 ఏళ్ల కిందట పెద్దపల్లికి చెందిన వెంకటేష్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్నారులు అదే గ్రామంలోని తమ అవ్వకు ఆదివారం వద్దకు వెళ్లారు. రాత్రి పొద్దుపోయిన తరువాత భర్త బయటకు వెళ్లారు. ఆ తరువాత తలుపు మూసి, గడియ వేసుకుని శాంతమ్మ చీరతో ఉరి వేసుకున్నారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

● అనంతపురంలోని విద్యారణ్యనగర్‌కు చెందిన అరుణ(44) మానసిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన ఇంట్లోనే ఆదివారం ఆమె విషం తాగారు. సోదరుడు శ్రీనివాసులు ఆలస్యంగా గమనించి, చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సిటీల మూసివేతను అడ్డుకోండి

» గవర్నర్‌కు బీజేపీ ఎమ్మెల్యేల వినతి

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కారణాలు చూపుతూ తొమ్మిది యూనివర్శిటీలను మూసివేయాలని ప్రభుత్వం భావిస్తోందని వెంటనే జోక్యం చేసుకోవాలని గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లోట్‌కు బీజేపీ ఎమ్మెల్సీల బృందం సోమవారం వినతిని ఇచ్చింది. విధానపరిషత్ సభ్యులు రవికుమార్, శశిల్‌నమోషి, డిఎస్ అరుణ్, హరీశ్ కృష్ణమూర్తి, ఎస్‌వి సంకనూరు, శశిధర్, రాఘవేంద్ర, అశ్విని శంకర్ తదితరులు గవర్నర్‌కు వినతిని ఇచ్చారు. 2019-20లో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు పది యూనివర్సిటీలను విద్యార్థులకు అనుకూలంగా ఉండాలని చారిత్రాత్మక నిర్ణయంతో ప్రారంభించామన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండాలని తెరిచామన్నారు. ఇప్పటివరకు పది యూనివర్సిటీలలోనూ వేలాదిమంది చదువుతున్నారన్నారు. అయితే ఒక్కసారిగా ప్రభుత్వం 9 యూనివర్సిటీలను మూసివేయాలని నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. వెంటనే జోక్యం చేసుకుని యూనివర్సిటీలు మూసివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేల బృందం

జీఏఎఫ్ఎక్స్ సదస్సు విజయవంతం



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న మంత్రి ప్రియాంకఖర్గే

బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీబీటీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన జీఏఎఫ్ఎక్స్ సదస్సు ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. కర్ణాటక రాష్ట్రం ఈ ఏడాది ఇ-స్పోర్ట్స్ రౌండ్‌టేబుల్ సమావేశాలు, గేమ్ డెవలపర్ సమ్మేళనాలకు ఆతిథ్యం ఇచ్చేందుకు నిర్ణయించింది. గేమ్స్, యానిమేషన్, విజువల్ ఎఫెక్స్‌ల రంగంలో యువతను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు మంత్రి ప్రియాంక ఖర్గే వెల్లడించారు. అమర్‌చిత్రకథా, టింకిల్ కామిక్స్‌కు జీఏఎఫ్ఎక్స్ అంకల్ పై ప్రామిసింగ్ న్యూ క్రియేటర్ అవార్డును ప్రకటించారు. నాలుగు ప్రముఖ జట్లు రూ.5లక్షల అవార్డుకోసం తలపడ్డాయి. మంత్రి ప్రియాంక ఖర్గే మాట్లాడుతూ రాష్ట్రం కేవలం ఐటీబీటీలకే పరిమితం కాకుండా గ్లోబల్ స్థాయిలో సృజనాత్మకతను వెలికితీయడంలోనూ మనోరంజన విభాగంలోనూ అడుగు పెట్టినట్టు తెలిపారు. ఇది కూడా ఒక బలమైన ఆర్థికశక్తి కానుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

అధునాతన వైద్యసేవలు పెరగాలి

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆధునాతన వైద్యసేవలు మరింత పెరగాలని తద్వారా రోగనిర్ధారణ సులభతరం కానుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు అభిప్రాయపడ్డారు. సోమవారం నగరంలోని రిచ్‌మండ్ రోడ్డులో గ్లెనిగల్ ఆసుపత్రిలో ఇంటర్‌వెర్షనల్ రేడియాలజీ క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు హ్యారిస్, ప్రదీప్ ఈశ్వర్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాథ్‌ల్యాబ్ ద్వారా ఖచ్చితమైన ట్యూమర్‌ల నిర్ధారణ చేయనుందన్నారు. రేడియాలజిస్ట్ ఉత్తప్ప మాట్లాడుతూ ఆధునిక పరికరాల ద్వారా ఉత్తమమైన సేవలు సాధ్యం కానున్నాయన్నారు. గ్లెనిగల్ హెల్త్ కేర్ సీఈఓ అనురాగ్‌యాదవ్, సీఓఓ జతీందర్ అరోరాలు పాల్గొన్నారు.



ల్యాబ్ ప్రారంభంలో మంత్రి దినేశ్‌గుండూరావు

చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

» యూనియన్ బ్యాంకు సీఎండీ మణిమేఖలై

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహకానికి ప్రాధాన్యత ఇస్తున్నామని యూనియన్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ ఏ మణిమేఖలై అభిప్రాయపడ్డారు. హొస్కోటెలో సోమవారం మెగా అవుట్‌రీచ్ క్యాంప్‌ను సీఎండీ లాంఛనంగా ప్రారంభించారు. ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నితీశ్ పాటిల్, కేంద్రప్రభుత్వ ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సోక్రటీస్, యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ జీఎం నవనీత్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ మణిమేఖలై మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అండగా ఉండాలనే పారిశ్రామికకేంద్రంగా పేరొందిన హొస్కోటెలో అవుట్‌రీచ్ ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరులో మూడు రీజియన్‌ల వారీగా ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్‌లను జరపదలిచామన్నారు. యూనియన్ ఎంఎంఇ సపోర్ట్, యూని యన్ నారీశక్తి, పీఎం విశ్వకర్మ, పీఎం జేడీవై వంటి పథకాల లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందిస్తున్నామన్నారు. అవుట్‌రీచ్ క్యాంప్‌లో 500మందికి పైగా లబ్ధిదారులు పాల్గొన్నారు. 351 మంది లబ్ధిదారులకోసం 476 కోట్లకు మంజూరులేఖలను అందించారు.



హొస్కోటె అవుట్‌రీచ్ ప్రారంభంలో యూనియన్‌బ్యాంకు సీఎండీ మణిమేఖలై తదితరులు

జౌళి పార్కు ఏర్పాటుకు సహకరించండి



గణేశ్‌కు గ్రామస్థుల ఆత్మీయ స్వాగతం

శిడ్లఘట్ట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బైయప్పనహళ్లిలో జౌళిపార్కు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య నివారణకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కావేరి హ్యాండ్‌లూమ్స్ అధ్యక్షుడు బీజే గణేశ్ కోరారు. కావేరి హ్యాండ్‌లూమ్స్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన తర్వాత స్వగ్రామమైన బైయప్పనహళ్లికి విచ్చేసిన సందర్భంగా గ్రామస్థులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిక్కబళ్లాపుర జిల్లా పట్టు పరిశ్రమ, పాడిరంగాలకు పేరొందిందన్నారు. పూలు, పండ్ల సాగులోనూ గుర్తింపు పొందన్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోనే ప్రదేశంలో జౌళి పార్కు ఏర్పాటుకు స్థలావకాశం ఉందన్నారు. కనీసం 10-15వేలమంది యువతీ యువకులకు ఉద్యోగం లభిస్తుందన్నారు. గతంలో జౌళి పార్కు ఏర్పాటుకు ప్రయత్నించగా కేబినెట్‌లో ఆమోదం లభించినా పలు కారణాలతో ఆగిపోయిందన్నారు. ఇకనైనా ఇక్కడ జౌళిపార్క్ ఏర్పాటుకు మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. హ్యాండ్‌లూమ్స్ అధ్యక్షుడిగా రెండోసారి అవకాశం కల్పించిన డైరెక్టర్‌లు, మంత్రులకు ధన్యవాదాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు నరసింహారెడ్డి, మర్చంట్ వెంకటరాయప్ప, దేవరాజ్, డైరెక్టర్‌లు ప్రభాకర్, అశ్వథ్, నారాయణ్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి సహకారం

బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థలు సహకారం అందించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బ్యాటరాయనపుర నియోజకవర్గ నాయకుడు తమ్మేశ్‌గౌడ అభిప్రాయపడ్డారు. యలహంక తాలూకా బాగలూరు మెయిన్‌రోడ్డులో ద్వారకానగర్ లే అవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజలకు సంఘం నాయకులు అండగా ఉండాలన్నారు. సహకారనగర్‌లో అవుతున్న పనులు ఇక్కడ ఎందుకు జరగడం లేదన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు తగిన చొరవ చూపాలన్నారు. కట్టిగేనహళ్ళికి కేంద్రమంత్రి శోభాకరంద్లాజె ఒక బోరువెల్, శుద్ధ తాగునీటి కేంద్రాన్ని మంజూరు చేశారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం ఉంటుందన్నారు. బ్యాటరాయనపుర బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు, అగ్రహార లే అవుట్ మునిస్వామి ఒడెయర్ (ఆనంద్ మాస్టర్), కట్టిగేనహళ్ళి గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎం మునితయప్ప, వీరప్ప, జీకే మనోహర్, ఎం మునియప్ప, అంబరీశ్, శ్రీనివాస్‌రావ్, మల్లికార్జునగౌడ, సంఘం కార్యవర్గ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అసోసియేషన్ కార్యాలయం ప్రారంభంలో ప్రముఖులకు సన్మానం

వేతనాలు పెంచాలని మధ్యాహ్న భోజన సిబ్బంది డిమాండ్

బాగేపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మధ్యాహ్న భోజనసిబ్బందికి వేతనాలు పెంచాలని అక్షరదాసోహసంఘం డిమాండ్ చేసింది. తమ డిమాండ్ల సాధనకై ఈనెల 4, 5 తేదీలలో నిరవధిక ధర్నా చేపట్టనున్నట్టు సంఘం అధ్యక్షుడు ముస్తఫా తెలిపారు. సోమవారం తాలూకా పంచాయతీ సభాంగణంలో ఈఓ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు.



ఈఓకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ప్రకటించిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఏప్రిల్, మే నెలల్లో కరువు జిల్లాల్లో పనిచేసినవారికి వేతనాలు విడుదల చేయాలని, వంట కేంద్రాలను పునరుద్ధరించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలని, ప్రతి నెలా సక్రమంగా గౌరవధనం విడుదల చేయాలని, కోడిగుడ్ల బకాయి మొత్తాలను విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది శాంతమ్మ, అమరావతి, రత్నమ్మ, నాగమణి, భారతమ్మ, సుబ్బమ్మ, నాగరత్నమ్మ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ మార్కెట్‌కు నూతన సర్వీసులు



పచ్చజెండా చూపుతున్న ఎమ్మెల్యే ప్రియాకృష్ణ

విజయనగర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గోవిందరాజనగర్ నియోజకవర్గ పరిధిలోని గంగొండహళ్ళి నుంచి కేఆర్ మార్కెట్‌కు బీఎంటీసీ బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రియాకృష్ణ ప్రారంభించారు. సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో కొత్త సర్వీసులకు పచ్చజెండా చూపారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సర్వీసు అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రైళ్ల స్టాపింగ్ రద్దు

గుంతకల్లు, మార్చి2(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఈస్ట్ రైల్వే స్టేషన్‌లో 3వ, 4వ లైన్ల పనుల కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్ గుండా వెళ్లే పలు రైళ్లకు ఆ స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-మైసూరు (నం. 12785) ఎక్స్‌ప్రెస్ రైలు, బెంగళూరు-ధర్మవరం (నం. 06595), ముంబై-బెంగళూరు (నం. 11301), ముంబై-కోయంబత్తూరు (నం. 11013), భువనేశ్వర్-బెంగళూరు (నం. 18463), దర్భంగ-మైసూరు (నం. 12577) అప్ అండ్ డౌన్ రైళ్లకు ఈ నెల 13వ తేదీ నుంచి నిరవధికంగా బెంగళూరు ఈస్ట్ రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు తెలిపారు.

హిందూపురం ప్యాసింజరుకు..

మక్కాజిపల్లి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ప్రయాణికుల వసతికి సంబంధించిన పనుల కారణంగా ఆ స్టేషన్‌లో గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు ప్యాసింజరు (నం. 77213/14) రైళ్ల స్టాపింగ్‌ను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ వరకూ మక్కాజిపల్లి స్టేషన్‌లో హిందూపురం ప్యాసింజరును నిలపరని తెలిపారు.



బెళగావిలో రియల్టర్ కిడ్నాప్

» గోకాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలే సూత్రధారి

» ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు

బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లాలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి బసవరాజ్ అంబిను కిడ్నాప్ చేసి ఐదుకోట్లు డిమాండ్ చేసిన కేసులో రాష్ట్ర ప్రజాపనులు శాఖా మంత్రి సతీశ్ జార్కిహొళి ప్రధాన అనుచరురాలితో పాటు ఏడుగురిని అరెస్టు చేశారు. ఫిబ్రవరి 20న బసవరాజ్ అంబి కిడ్నాప్‌కు గురయ్యారు. కిడ్నాప్ చేసిన వారు రహస్య ప్రదేశానికి తీసుకెళ్ళి ఐదుకోట్లు డిమాండ్ చేశారు. బసవరాజ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అతడిని రక్షించారు. అయితే కిడ్నాప్‌కు గల కారణాలు ఏమిటి కీలక సూత్రధారుల కోసం పోలీసులు అనే కోణంలో విచారణలు జరిపి సూత్రధారులను గుర్తించినట్లు జిల్లా ఎస్పీ భీమాశంకర గుళేద తెలిపారు. సోమవారం బెళగావిలో ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి 20న రియల్టర్ బసవరాజ్ అంబిను కిడ్నాప్ చేసిన వారు ఐదుకోట్లు డిమాండ్ చేశారన్నారు. బసవరాజ్ కుమారుడికి ఫోన్ చేసి ఐదుకోట్లు ఇవ్వకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారన్నారు. కానీ బసవరాజ్ భార్య నేరుగా గోకాక్ పోలీసులకు ఫిర్యాదు చేశారని వెంటనే రంగంలోకి వివిధ బృందాల ద్వారా గాలింపులు జరిపి గుర్తించి కిడ్నాపర్ల నుంచి రక్షించామన్నారు. రియల్టర్ బసవరాజ్ అక్రమాలకు పాల్పడిన విషయం తెలుసుకున్న వారు గుంపుగా ఏర్పడి కిడ్నాప్‌కు పాల్పడ్డారన్నారు. గోకాక్ పట్టణానికి చెందిన మంజుళ, ఈశ్వర రామగానట్టి, సచిన్ కాంబళె, రమేష్ కాంబళె, రాఘవేంద్ర మారాపులను అరెస్టు చేశామన్నారు. మిగిలిన వారి కోసం గాలింపులు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా అరెస్టు అయిన మంజుళ గోకాక్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సతీశ్‌జార్కిహొళికు అత్యంత సన్నిహితురాలనే విషయం బహిరంగమైంది.

ఉడుపి జిల్లాలో దుబాయ్ రిజిస్ట్రేషన్ కార్ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న దుబాయ్ రిజిస్ట్రేషన్ కార్లు

బెంగళూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో రిజిస్ట్రేషన్ కలిగిన కార్లు ఉడుపి జిల్లాలో తిరుగుతుండటాన్ని గమనించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మణిపాల్ జిల్లాధికారి కార్యాలయం రోడ్‌లో జరిగిన పార్టీకు కేరళ విద్యార్థులు తీసుకువచ్చిన కార్లను స్వాధీనం చేసుకున్నారు. డాడ్జ్ పేరుతో ఉండే రెండు కార్లలో కేరళకు చెందిన సులైమన్ మహమ్మద్, మహమ్మద్‌షరీఫ్, అబ్దుల్‌నజీర్‌లు దేశంలో తిరిగేందుకోసం కార్లను దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. దుబాయ్ దేశంలో రూ.30లక్షలు, భారత్‌లో ప్రవేశించేందుకు కోటి రూపాయలు చెల్లించి తీసుకువచ్చినట్లు తెలిపారు. స్టీమర్ ద్వారా కార్లను తీసుకువచ్చామన్నారు. అయితే వారు ఎన్ని కార్లను దిగుమతి చేసుకుంది తెలియరాలేదు. కానీ కేరళ నుంచి ఉడుపి వచ్చిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఇతర దేశాలలో రిజిస్టర్ చేసిన కార్లు మన ప్రాంతంలో తిరిగేందుకు అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయమై ఉడుపి పట్టణ పోలీసులు జిల్లా రవాణా శాఖాధికారి కార్యాలయానికి లేఖ రాసినట్లు తెలిపారు.

ఐటీ హబ్‌లో ఉన్నత విద్య పెరగాలి

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఐటీ హబ్‌గా పేరొందిన బెంగళూరు నగరంలో ఉన్నత విద్య మరింత పెరగాలని అందులో గుణాత్మకతకు ప్రాధాన్యత ఉండాలని పలు విద్యాసంస్థల ప్రముఖులు అభిప్రాయపడ్డారు. నగరంలో 50కుపైగా విద్యాసంస్థల ప్రముఖులచే చర్చావేదిక జరిగింది. వివిధ విద్యాసంస్థల డైరెక్టర్‌లు, ప్రిన్సిపాల్‌లు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా పలువురి అభిప్రాయం ప్రకారం వ్యక్తిగత నైపుణ్యత పెరగాల్సి ఉందని, సాంకేతిక బోధనలకు అనుకూలమైన క్లాస్‌రూంలు ఆ దిశగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, బ్రూక్లిన్ నేషనల్ పబ్లిక్‌స్కూల్, క్రైస్ట్ ఇంటర్నేషనల్ స్కూల్, హర్ష ఇంటర్నేషనల్ స్కూల్, జీనియస్‌గ్లోబల్ స్కూల్, ఆర్కిడ్ ఇంటర్నేషనల్ విద్యాసంస్థలతోపాటు పలుసంస్థల ప్రముఖులు పాల్గొన్నారు. దేశంలోని నగరాలలో చర్చాగోష్టులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

గుంతకల్లు టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీరప్ప సర్కిల్‌లో నివాసముంటున్న వడ్డె మస్తాన్(55)అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. వికలాంగుడైన మస్తాన్ బీరప్ప సర్కిల్‌లో నివాసముంటున్నాడు. కుమారుడు పామిడిలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పించన్ డబ్బులు తీసుకుని ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ డిపో పక్కన ఉన్న పెట్రోల్ బంకు వెనుక చెట్ల కింద మద్యం సేవించేందుకు వెళ్లాడు. సోమవారం మస్తాన్ తమ్ముడి కొడుకు 100 నెంబరుకు ఫోన్ చేసి మస్తాన్‌ను హత్య చేశారని ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. మద్యం బాటిళ్లు పడి ఉండటాన్ని గుర్తించి అతిగా మద్యం సేవించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.